సాక్షి
నల్లగొండ
శనివారం । 30 । నవంబర్ । 2024



దావోస్ ఒప్పందాల సంగతేంటి?
దావోస్‌లో అదానీ కంపెనీలతో ప్రభుత్వ ఒప్పందాల సంగతేంటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం ప్రశ్నించారు. - 10లో



నారసింహుడి స్మరణతో..
యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనర్సింహస్వామి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకొని శుక్ర వారం గిరి ప్రదక్షిణలు చేశారు. - 10లో



'కాళేశ్వరం'పై విచారణ
కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిపై విచారణ జరుగుతుందని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ అన్నారు. - 10లో

న్యూస్‌రీల్

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

నల్లగొండ: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశా లల్లో చదివే ఎస్సీ విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలు కోసం దరఖాస్తు చేసుకోవా లని జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి కోటేశ్వ ర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన విద్యార్థులు డిసెంబర్ 12 తేదీ వరకు, రెన్యూవల్ కోసం డిసెంబర్ 30 తేదీలోగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి ఆసరా పింఛన్లు

నల్లగొండ: ఈ నెల 30 (శనివారం) నుంచి డిసెంబర్ 6వ తేదీ వరకు ఆసరా తదితర పిం ఛన్లు పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఓ శేఖర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిం ఛన్‌దారులు పంపిణీ ప్రాంతాలకు వెళ్లి పిం ఛన్లు పొందాలని కోరారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అను సరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్య మిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్ర వారం మిర్యాలగూడలోని సీపీఎం కార్యాల యంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 2న మిర్యాలగూడలో జరిగే బహిరంగ సభకు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు రాఘవులు హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లే ష్, నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, రవినాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, నాగేశ్వర్‌నాయక్, రవినాయక్, ఉస్నం వెంకటేశ్వర్లు, వేణుధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఎస్‌ఓ

హాలియా: ధాన్యం కొనుగోళ్లలో వేగం పెం చాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి (డీ ఎస్‌ఓ) వెంకటేశ్వర్లు అన్నారు. హాలియా వ్యవ సాయ మార్కెట్ ఆవరణలో కొనసాగుతున్న కొత్తపల్లి పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రా న్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఏమై నా ఇబ్బందులు ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ధాన్యం కొనుగోలు చేసిన రికార్డులను పరిశీలించి మాట్లాడారు. తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కాంటా వేయాలన్నారు. కార్యక్రమం లో డీఎం హరీష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి, సీఈఓలు సత్యం, జానయ్య, సెక్ర టరీ వెంకట్‌రెడ్డి ఉన్నారు.

పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

కట్టంగూర్: పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి(డీ వీఏహెచ్‌ఓ) సయ్యద్ మస్తాక్ అహ్మద్ ఖాద్రీ అన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్ర వారం కట్టంగూర్ మండలం అయిటిపాముల జీపీ పరిధి గంగదేవిగూడెంలో చేపట్టిన ఉచిత గర్భకోశ వ్యాధి నివారణ శిబిరాన్ని ఆయన సం దర్శించారు. దూడలకు నట్టల నివారణ మందు తాగించి, టీకాలను వేసి మాట్లాడారు. ఈ కార్య క్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ డాక్టర్ రాజశేఖర్, మండల వైద్యాధికారి బిక్యా నాయక్, వీఏ స్వాతి, కార్యదర్శి అనిల్, సూపర్ వైజర్ సాయి తదితరులు పాల్గొన్నారు.



కాన్పు చేయించుకున్న వారితో కుటుంబ సభ్యులు, వైద్యులు, సిబ్బంది

24 గంటలు.. 14 ప్రసవాలు

దేవరకొండ : దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో 24గం టల్లో 14ప్రసవాలు జరిగాయి. గురువారం ఉదయం 9గంటల నుంచి శుక్రవారం ఉదయం 9 గంటల వరకు వైద్యులు 14 ప్రసవాలు చేసినట్లు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ మంగ్తానాయక్ తెలిపారు. ఆరు నార్మల్ డెలివరీలు జరుగగా, 8 సిజేరియన్ ఆప రేషన్లు నిర్వహించారు. ఆస్పత్రి వైద్యులు కన్యాకు మారి, రవిప్రకాష్, రేణుగోపాల్, మోతీలాల్, స్వప్న, శశికళ, శాంతిస్వరూపతో పాటు విధుల్లో ఉన్న వైద్య సిబ్బంది ఈ ప్రసవాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. వైద్యులు, సిబ్బందిని అభినందించారు.

నీలగిరికి ప్రత్యేక నిధులు

స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద రూ.109.21 కోట్లు

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చొరవతో మంజూరు చేసిన ప్రభుత్వం
- శివారు కాలనీల్లో సమకూరనున్న మౌలిక సదుపాయాలు



నల్లగొండ టూటౌన్: నీలగిరి మున్సిపాలిటీ పరిధిలోని శివారు ప్రాంతాలకు అభివృద్ధి యోగం పట్టనుంది. శివారు కాలనీల్లోని ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. చిన్నపాటి వర్షం కురిసినా వీధులు చిత్తడిగా మారి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. గత పదేళ్ల కాలంలో వివిధ కాలనీల అభివృద్ధికి నిధులు కేటాయించలేదని పాలకవర్గ సభ్యులే అంటు న్నారు. ఈ నేపథ్యంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నీలగిరి పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారిం చారు. దీంట్లో భాగంగా నీలగిరి అభివృద్ధికి ప్రత్యేక నిధులివ్వాలని మంత్రి పట్టుబట్టడంతో సీఎం ఇటీ వల రూ.109.21 కోట్లు మంజూరు చేశారు. రాష్ట్రం లో ఏ మున్సిపాలిటీకి ఇవ్వకున్నా నీలగిరికి మాత్రమే స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద నిధు లు మంజూరు చేయడం గమనార్హం. ఈ నిధులతో శివారు కాలనీల్లో మౌలిక వసతులు కల్పించను న్నారు. ఇందుకు గాను మున్సిపల్ అధికారులు అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేశారు.

సీసీ రోడ్లు, నాలాల నిర్మాణానికి పెద్దపీట

నీలగిరి పట్టణంలోని శివారు ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి పెద్దపీట వేశారు. 93 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మాణం చేప ట్టాలని నిర్ణయించారు. అదేవిధంగా భారీ వర్షాలు కురిస్తే పట్టణంలో ఆస్తినష్టం జరుగకుండా వరద నీరు దిగువకు వెళ్లేందుకు వరద కాల్వలు (స్ట్రామ్ వాటర్ డ్రెయినేజీల) నిర్మాణం చేపట్టనున్నారు. సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.55,35,41,898 కేటాయించారు. అలాగే బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.10,54,66,547, వరద కాల్వల నిర్మాణానికి రూ.17.44కోట్లు, గొల్లగూడలోని వైకుంఠధామం లో కనీస వసతుల కల్పనకు రూ.1,74,08,159 కేటాయించారు. ఇతర పనులకు మరికొన్ని నిధులు కేటాయించారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా కేంద్రానికి రానున్నందున ఆయా పనులకు శంకు స్థాపన చేయనున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.

కాలనీల్లో తీరనున్న సమస్యలు

గత ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీలోని శివారు కాలనీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే పేరు కుపోయాయి. ముఖ్యంగా సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేక మురుగు నీటి సమస్యతో శివారు కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుత ప్రభు త్వం మున్సిపాలిటీకి నిధులు మంజూరు చేయడం తో ఆయా సమస్యలు తీరనున్నాయి. దీంతో పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం



నీలగిరి పట్టణాభివృద్ధి కోసం మంత్రి వెంకట్‌రెడ్డి ప్రత్యేకంగా రూ.109.21 కోట్లు మంజూరు చేయిం చారు. టెండర్ల ప్రక్రియ త్వరగా పూర్తిచేసి త్వర గానే పనులు ప్రారంభిస్తాం. నీలగిరిని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం.

– బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్

కేసీఆర్ దీక్షతోనే ఉవ్వెత్తున ఉద్యమం



దీక్షా దివస్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

- చంద్రబాబు కుట్రలను తిప్పికొట్టారు
- కేసీఆర్ లేకపోతే తెలంగాణ లేదు
- నల్లగొండ దీక్షా దివస్‌లో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున లేచిందని మాజీమంత్రి గుంత కండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని పెద్ద గడియారం సెంటర్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నవంబర్ 29వ తేది తెలంగాణ మలిదశ పోరాట చరిత్రలో ఎం తో ముఖ్యమైన రోజు అని గుర్తు చేశారు. కేసీఆర్‌ను నిలువరించి తెలంగాణ ఉద్యమాన్ని అణచివేయా లని చంద్రబాబు నాయుడు చేసిన కుట్రను కేసీఆర్ తిప్పికొట్టారన్నారు. చివరకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చీల్చాలని చంద్రబాబు ప్రయత్నించినా కేసీఆర్ ముందు ఆయన పప్పులు ఉడకలేదన్నారు. నా స్వప్నం తెలంగాణ, నా ధ్యేయం తెలంగాణ అని కేసీఆర్ నినదించి ఉద్యమాన్ని ముందుకు నడిపార న్నారు. సమైక్యాంధ్ర నాయకులు, ఆంధ్రా మీడియా ఎన్ని ఎత్తులు, కుట్రలు వేసినా.. చంద్రబాబు, రోశయ్య ఒక్కటైనా తెలంగాణ ఉద్యమాన్ని కేసీఆర్ ఆపలేదన్నారు. ఆనాడు కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ నాయకులు ఒక్కడు కూడా కేసీఆర్‌కు సపోర్ట్ చేయలే దని ఆరోపించారు. యావత్ తెలంగాణ సమా జానికి కేసీఆరే నాయకుడని, కేసీఆర్ అకుంఠిత దీక్షను ప్రజలందరికీ విడమరిచి చెప్పాలన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, ఎన్.భాస్కర్‌రావు, కం చర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, నోముల భగత్ మాట్లాడుతూ కాంగ్రెస్ మోసపూరిత హామీల తో గద్దెనెక్కి ప్రజలను మోసం చేసిందన్నారు. రైతు లకు రూ. 2లక్షల రుణమాఫీ అని రైతులను నట్టేట ముంచిన రేవంత్‌రెడ్డి సర్కార్‌కు బుద్ధి చెప్పాల న్నారు. గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెస్ ప్రజాప్రతినిధు లను హామీల అమలుపై నిలదీయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, చెరుకు సుధాకర్, చకిలం అనిల్‌కుమార్, పాల్వాయి స్రవంతి, దూదిమెట్ల బాలరాజు యాదవ్, మాలె శరణ్యారెడ్డి, బక్క పిచ్చయ్య, రాంచంద్రనాయక్, కటికం సత్త య్యగౌడ్, బొర్ర సుధాకర్, రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి, బోనగిరి దేవేందర్, మాజీ ఎంపీపీలు, జెడ్పీసీలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి



అన్నాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



పాఠశాల ప్రిన్సిపాల్‌కు అన్నం వాసన చూపిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు: ప్రభుత్వ గురుకులాలు, హాస్టళ్లలో ఉం టూ చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మునుగోడులోని బీసీ బాలికల గురుకులాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు వండిన వంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తానే భోజనం వడ్డించి రుచిగా ఉందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అన్నం ముద్ద వాసన రావడం, పెరుగు పుల్లగా ఉండడం, కూరలు రుచికరంగా లేక పోవడంతో ప్రిన్సిపాల్‌తోపాటు వంట ఏజెన్సీ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనం తరం ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లల పొట్టలు కొట్టి లాభాలు పొందాలని చూడడం సరైందికాద న్నారు. మరోమారు ఇలా ఉండొద్దని హెచ్చరిం చారు. అనంతరం ఎమ్మెల్యే మునుగోడులో కొనసా గుతున్న రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. పనులు నాణ్యంగా చేపట్టాలని, అధికారులు ఎప్ప టికప్పుడు పరివేక్షించాలని సూచించారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, చం డూరు ఆర్‌డీఓ శ్రీదేవి, మునుగోడు తహసీల్దార్ ఎం.నరేందర్, ఎంపీడీఓ విజయప్రసాద్, పాఠశాల సిబ్బంది, పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

నిధుల దుర్వినియోగంపై జెడ్పీ సీఈఓ విచారణ

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి ఎంపీడీఓ బాల రాజురెడ్డి, చిన్నఅడిశర్లపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి సరస్వతి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఫిర్యాదు నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం జెడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్‌రెడ్డి మండల కేంద్రంలో విచారణ చేపట్టారు. ఎంపీడీఓ, కార్యదర్శిని విచారించి వివరాలు సేకరించారు. విచారణలో సేకరించిన వివరాలను జిల్లా కలెక్ట ర్‌కు అందజేయనున్నట్లు జెడ్పీసీఈఓ తెలిపారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులు చిన్నఅడిశర్లపల్లి మాజీ సర్పంచ్ జి.శ్రీరాములు, చింతకుంట్ల మాజీ సర్పంచ్ పంది రుద్రమ్మశ్రీను, కొల్‌ముంతలపహాడ్ మాజీ సరపంచ్ రమావత్ రవినాయక్, రాము నిగుండ్లతండ సర్పంచ్ అరుణశ్రనాయక్, దేవ రోనితండా సర్పంచ్ రాకేశ్ మాట్లాడుతూ ఎంపీ డీఓ, కార్యదర్శి ఇద్దరు కుమ్మక్కై నిధుల దుర్వినియోగం చేశారని, ఎస్సీ, ఎస్టీ సర్పంచ్‌లకు బిల్లులు రాకుండా ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. విచారణలో సీనియర్ అసిస్టెంట్లు శ్రీనివాస్, హరినాథ్ ఉన్నారు.



వివరాలు సేకరిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధచూపాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

త్రిపురారం, వేములపల్లి (మాడ్గులపల్లి): ప్రభుత్వ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. గురువారం నిడమనూరులోని కేజీబీవీ, ధాన్యం కొనుగోళ్లు, మండలంలోని వేం పాడు స్టేజి వద్ద మైనార్టీ గురుకులం, అలాగే మాడ్గు లపల్లిలోని కేజీబీవీని వేర్వేరుగా తనిఖీ చేశారు. అదే విధంగా మాడ్గులపల్లిలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు సర్వే నెం.257లోగల ప్రభుత్వ భూమిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా హాస్టళ్లలో రికార్డులు, భోజనం, ఇతర అంశా లను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చ టించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులకు వెళ్లి పాఠాలు బోధించి విద్యార్థులను ప్రశ్నలడిగి వారి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయా హాస్టళ్ల సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి లక్ష్యాలను చేరు కోవాలన్నారు. రైతులకు ఇబ్బందు లు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్ల సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమాల్లో త్రిపురారం, మాడ్గులపల్లి తహ సీల్దార్లు కృష్ణయ్య, పద్మ, మాడ్గులపల్లి ఎంపీడీఓ స్వామి, ఆయా మండలాల ఎంఈఓలు లావురి వెం కన్న నాయక్, వెంకటమ్మ, ఎస్‌ఓ వసంత, ఆర్‌పి రేణుక, అధికారులు పాల్గొన్నారు.



నిడమనూరు కేజీబీవీలో బియ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి



మాడ్గులపల్లిలో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న కలెక్టర్ త్రిపాఠి

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



బహుమతులు అందజేస్తున్న రాజ్‌కుమార్, అధికారులు

నల్లగొండ: విద్యార్థులు చదువు తోపాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి రాజ్‌కుమార్, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఖాజా నజీమ్‌అలీ అప్సర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రం లోని మేకల అభినవ్ స్టేడియంలో ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్ స్థాయిలో విద్యార్థులకు జిల్లా స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్‌తో పాటు పలు అంశాల్లో నిర్వహించిన క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీ ల్లో రాణించిన విద్యార్థులకు ఇచ్చే సర్టిఫికెట్లు ఉన్నత చదువులతో పాటు ఉద్యోగాలు సాధించేందుకు ఉపయోగపడతాయన్నారు. అనంతరం గెలుపొం దిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ సహాయ అధికారులు సంజీవయ్య, ఎస్తేర్, వసతిగృహ సం క్షేమ అధికారుల సంఘం అధ్యక్షుడు రణదీవె, తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిని నిర్మూలించేలా..

- డిసెంబర్ 2 నుంచి 'ఎల్‌సీడీసీ'
- లెప్రసీ కేసులను ముందస్తుగా గుర్తించేందుకే ఇంటింటి సర్వే
- లక్షణాలు ఉన్నవారికి పీహెచ్‌సీలలో చికిత్స
- సర్వేకు 1,466 బృందాల నియామకం



ఎల్‌సీడీసీ సర్వే చేస్తున్న ఆశా వర్కర్ (ఫైల్)

నల్లగొండ టౌన్: కుష్టువ్యాధి (లెప్రసీ) లక్షణాలు ఉన్నవారిని ముందుగా గుర్తించి వారికి చికిత్స అం దించడం ద్వారా వ్యాధిని నిర్మూలనించాలనే లక్ష్యం తో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోం ది. 2017 నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యం లో లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్‌సీడీసీ) సర్వేను ఏటా రెండుసార్లు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలో డిసెంబర్ 2 నుంచి 15వ తేదీ వరకు ఎల్‌సీడీసీ సర్వేకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది.

ఆశా వర్కర్ల ద్వారా సర్వే..

జిల్లాలో లెప్రసీ క్యాంపెయిన్ నిర్వహణకు గాను వైద్య ఆరోగ్యశాఖ.. ఆశావర్కర్లను 1,466 బృం దాలుగా ఏర్పాటు చేసింది. ఒక్కో ఆశా వర్కర్ పట్టణంలో అయితే రోజూ 50 నుంచి 60 ఇళ్లను సర్వే చేయాల్సి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో 20 నుంచి 30 ఇళ్లను సర్వే చేయనున్నారు. కుటుంబం లోని ప్రతి ఒక్కరి పూర్తి బాడీని పరిశీలించి తెల్ల, ఎర్రమచ్చలు, స్పర్శలేని మచ్చలు, నరాల బలహీ నత ఉన్నాయా లేదా అనే పరిశీలిస్తారు. వారిలో లెప్రసీ లక్షణాలు ఉన్న వారిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపిస్తారు. అక్కడ వారికి బహుళ ఔషధ చికిత్స (మల్టీ డ్రగ్ థెరపీ- ఎండీటీ) పద్ధతిన చికిత్స అందించనున్నారు. ఇంకా వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే జిల్లా కేంద్రంలో లెప్రసీ సెంటర్‌కు పంపించి చికిత్స అందించనున్నారు. ఎల్‌సీడీసీ సర్వేపై ఇప్పటికే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మెడికల్ ఆఫీసర్‌లను, సూపర్‌వై జర్లు, ప్రోగ్రాం అధికారులతో సమావేశం నిర్వహిం చి దిశానిర్దేశం చేసింది. గతంలో జిల్లాలో లెప్రసీ కేసులు వందల సంఖ్యలో ఉండగా 2017 నుంచి లెప్రసీ కేసుల సంఖ్య గణనీయంగా తగ్గుతూ వస్తోందని, ప్రస్తుతం జిల్లాలో 94 లెప్రసీ కేసులు మాత్రమే ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

కుష్టు లక్షణాలు ఇవీ..

కుష్టు వ్యాధి(లెప్రసీ) అనేది మైక్రోబ్యాక్టీ రియం లెప్రో అనే బ్యాక్టీరియా వల్ల కలిగే దీర్ఘ కాలిక వ్యాధి. ఇది ప్రధానంగా నరాలు, చర్మం, ముక్కు ద్వారం, ఎగువ శ్వాస నాళాలపై ప్రభావం చూపుతుంది. చర్మంపై ఎర్రని, గోధుమరంగు (పాలిపోయిన) స్పర్శ లేని తిమ్మిరి) మచ్చలు ఉంటే కుష్టువ్యాధి లక్ష ణాలుగా గుర్తించాలి.

మచ్చలు ఉంటే చూపించాలి



శరీరంపై ఎక్కడైనా స్పర్శ లేని, తెల్లని, గోధుమరం గు, ఎర్రని మచ్చలు ఉంటే ఎల్‌సీడీసీ సర్వేకు వచ్చే ఆశా వర్కర్లకు తప్పనిస రిగా చూపించాలి. లెప్రసీ లక్షణాలు ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తీసుకుపోయి చికిత్స చేయిస్తారు. ప్రతిఒక్కరూ ఈ అవకాశా న్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డీఎంహెచ్‌ఓ

డేటా ఎంట్రీ.. 68.18 శాతం

- ముమ్మరంగా సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ ప్రక్రియ
- మరో నాలుగు రోజుల్లో పూర్తయ్యే అవకాశం

నల్లగొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేప ట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల గణన సమగ్ర కుటుంబ సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ జిల్లాలో ముమ్మరంగా కొనసాగు తోంది. జిల్లాలో నూటికి నూరు శాతం సర్వే పూర్త య్యింది. ఆదివారం నుంచి సర్వే ఫారాల ఆన్‌లైన్ నమోదు ప్రారంభించారు. ఆరు రోజుల్లోనే 68.18 శాతం దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేశారు.



నల్లగొండ మహిళా డిగ్రీ కళాశాలలో డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న అధికారులు

ఇప్పటి వరకు 3.47లక్షల ఇళ్లు..

ఎన్యుమరేటర్లు చేసిన సర్వేకు సంబంధించిన ఫారాల ఆన్‌లైన్ ప్రక్రియ వేగంగా సాగుతోంది. జిల్లాలో ఎంపీడీఓ, ఎంఈఓ కార్యాలయాలతో పాటు ఆర్డీఓ కార్యాలయాలు, ఇతర ప్రైవేట్ ఇన్‌స్టి ట్యూట్లలో ఆదివారం నుంచి ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ ఆరు రోజుల్లో 3,47,471 గృ హాలకు సంబంధించిన దరఖాస్తుల ఆన్‌లైన్ చేశారు. మరో నాలుగు రోజుల్లో మొత్తం ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని అధికారవర్గాలు పేర్కొన్నాయి.

సర్వే, డేటా ఎంట్రీ వివరాలు ఇలా..

సర్వే ప్రారంభం	ఈ నెల 6న
ముగింపు	20వ తేది
మండలాలు	33
మున్సిపాలిటీలు	08
సర్వే చేసిన ఇళ్లు	5.09లక్షలు
డేటా ఎంట్రీ పూర్తయిన ఇళ్లు	3.47 లక్షలు

క్లుప్తంగా

ఏఎమ్మార్పీ కాల్వలో పడి వృద్ధురాలు దుర్మరణం

పెద్దఅడిశర్లపల్లి : ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వలో పడి ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ సంఘటన శుక్రవారం పీఏ పల్లి మండలంలో చోటు చేసుకుంది. గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చింతల్‌తండాకు చెందిన రమావత్ కొటాలి(85) కొంతకాలంగా కేశంనేనిపల్లి గ్రామంలో తన చిన్నకొడుకు వద్ద ఉంటుంది. కొటాలికి కొన్ని రోజులుగా కంటిచూపు మందగించడంతో పాటు మతిస్థిమితం సరిగా లేక ఈ నెల 26న ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, ఇతర చోట్ల వెతుకుతుండగా గుడిపల్లి గ్రామశివారులో గల ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వలో కొటాలి పడి ఉండడాన్ని గుర్తించారు. ప్రమాదవశాత్తు కాల్వలో పడి మృతి చెందిందని మృతురాలి చిన్నకుమారుడు రమావత్ పాండు తెలిపారు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు పేర్కొన్నారు.

పాము కాటుతో విద్యార్థి మృతి


గాజుల మనీష్‌గౌడ్ (ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్: పాము కాటుతో ఇంటర్ విద్యార్థి మృతి చెందిన సంఘటన యాదగిరిగుట్ట మండలం మహబూబ్ పేట గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. మహబూబ్ పేట గ్రామానికి చెందిన గాజుల సిద్దులు, భాగ్యమ్మ దంపతుల కుమారుడు గాజుల మనీష్(17) ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. రోజువారీగానే గురువారం రాత్రి తన ఇంట్లో నిద్రపోయాడు. ఈ క్రమంలో తనను ఏదో కాటేసినట్లుగా అనిపించి లేచి కుటుంబ సభ్యులకు తెలిపాడు. వెంటనే అతడు అపస్మారక స్థితిలో వెళుతుండగా, కుటుంబ సభ్యులు మనీష్‌ను భువనగిరిలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పాము కాటు వేసిందని తెలిపారు. పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌కు వెళ్లాలని సూచించారు. వెంటనే హుటాహుటిన హైద్రాబాద్‌కు తరలిస్తుండగా, మార్గమధ్యలో మనీష్ మృతి చెందాడు. గ్రామస్తులు పాము కోసం ఇంట్లో వెతకగా.. బియ్యం బస్తాల సమీపంలో పాము కనపడింది. వెంటనే పామును కొట్టి చంపారు. కాగా, మనీష్ తండ్రి సిద్దులు సంవత్సరం క్రితం తాటి చెట్టుపై నుంచి పడి మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు పాము కాటుతో మృతిచెందడంతో తల్లి శోకసంద్రంలో మునిగిపోయింది.

అనారోగ్యంతో బాధపడుతూ వ్యక్తి ఆత్మహత్య


శంకరయ్య(ఫైల్)

చౌటుప్పల్ రూరల్: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చౌటుప్పల్ మండలంలోని జైకేసారం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జైకేసారం గ్రామానికి చెందిన సాల్వాది శంకరయ్య(65) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మానసికంగా ఇబ్బంది పడి గురువారం సాయంత్రం వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగాడు. భార్య గమనించి శంకరయ్యను వెంటనే చౌటుప్పల్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శంకరయ్య గురువారం రాత్రి మరణించాడు. మృతుడికి భార్య, ఒక కొడుకు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కూతుళ్లకు వివాహం అయ్యింది. శంకరయ్య మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్ట్‌మార్టం చేశారు. మృతుడి కొడుకు వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

కనులపండువగా గంధం ఊరేగింపు


గంధం తీసుకెళ్తున్న డీఎస్పీ రవి, సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్‌ఐ తదితరులు


దర్గా వద్ద వెలిసిన దుకాణాలు

- అర్వపల్లి ఉర్సు ప్రారంభం
- గంధం పాత్రలు తలపై పెట్టుకుని ఊరేగింపుగా తీసుకెళ్లిన అధికారులు, నిర్వాహకులు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

అర్వపల్లి: మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన అర్వపల్లి సమీపంలోని హజ్రత్ ఖాజానసీరుద్దీన్ బాబా దర్గా ఉర్సు శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన అర్వపల్లి ఉర్సుకు ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాత్రి 7 గంటలకు అర్వపల్లి పోలీస్‌స్టేషన్ నుంచి గంధం ఊరేగింపు ప్రారంభమైంది. స్టేషన్‌లో ప్రార్థనలు జరిపిన అనంతరం సూర్యాపేట డీఎస్పీ జి.రవి, నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది దరూరి యోగానందచారి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపల్లి


దర్గాలో బాబా సమాధికి పూలు, గంధం సమర్పిస్తున్న భక్తులు

మధుకర్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే.మహమూద్, ఎస్‌ఐ సీహెచ్.బాలకృష్ణ, నిర్వాహకుడు మహ్మద్‌హుస్సేన్, ముజావర్ సయ్యద్ అలీ గంధం పాత్రలను తలపై పెట్టుకుని ముస్లిం ఆచారాలకు అనుగుణంగా నడిచారు. ఊరేగింపునకు ముందు పకీర్‌లు చువ్వలతో ఒంటినిండా పొడుచుకుంటూ జరబ్ నిర్వహించారు. అర్వపల్లి జంక్షన్ వరకు ఊరేగింపుగా వచ్చి గంధంను సాగనంపారు. కాగా దర్గా వద్దకు ఊరేగింపు చేరుకోగానే గంధం కోసం భక్తులు ఎగబడ్డారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు టాస్క్‌ఫోర్స్ టీం ఇన్‌చార్జ్ అహ్మద్ ఆసిఫ్‌ఖాన్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, పెసర సతీష్‌రెడ్డి, మున్నా, హబీబ్, సోఫి ఎంపీటీసీ గోపి, పంచాయతీ కార్యదర్శి నవీన్‌రెడ్డి, గిరిబాబు, బొరోజు ఉపేందర్, విక్రం, బన్ని, సంపత్, వివిధ గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ బందోబస్తు

ఉర్సు సందర్భంగా సూర్యాపేట డీఎస్పీ రవి, నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్‌ఐ బాలకృష్ణల ఆధ్వర్యంలో తుంగతుర్తి సీఐ శ్రీనుతోపాటు ఆరుగురు ఎస్‌ఐలు, 60మంది పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్నారు.

రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యం

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి


ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి

మునుగోడు: రైతుల సంక్షేమమే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రధాన లక్ష్యమని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్ర సహకార శాఖ కమిషన్ ఆదేశాల మేరకు శుక్రవారం మునుగోడులోని ప్రాథమిక సహకార సంఘం వద్ద రైతు పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ తమ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు తక్కువ వడ్డీకి రుణాలతోపాటు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందిస్తున్నామన్నారు. రైతులు పండించిన వరి ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర చెల్లించేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి ధాన్యం సేకరిస్తున్నామని తెలిపారు. రైతులు సహకార సంఘం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. అనంతరం సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు అందించే పథకాలపై రూపొందించిన ఫ్లెక్సీని కుంభం శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్లు జిట్టగోని యాదగిరి, మేకల మల్లయ్య, దుబ్బ గోపాల్, కూతాటి భిక్షమయ్య, మోహన్‌రెడ్డి, సింగం వెంకన్న, మాదరబోయిన యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

హోటల్‌లో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

భువనగిరి టౌన్ : పట్టణంలోని ఓ హోటల్‌లో శుక్రవారం ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీ చేస్తుండగా వినియోగదారులకు అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది. వివరాలు.. ఫుడ్ సేఫ్టీ అధికారుల బృందం రామస్వామి హోటల్‌కు వచ్చి భోజనం చేస్తున్నారు. ఈ క్రమంలో ఫుడ్‌సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ డాక్టర్ ఎం. సుమన్‌కళ్యాణ్‌కు అన్నంలో వెంట్రుక వచ్చింది. ఈ విషయమై హోటల్ యజమానిని ప్రశ్నించగా నిర్లక్ష్యం సమాధానం చెప్పాడని ఫుడ్‌సేఫ్టీ అధికారిణి స్వాతి తెలిపారు. దీంతో వంటశాల, హోటల్‌లోని ఇతర ప్రదేశాలు పరిశీలించినట్లు చెప్పారు. కాగా అధికారులు హోటల్ నిర్వాహకులతో మాట్లాడే సమయంలో అక్కడ భోజనం చేస్తున్నవారు అధికారులతో వాగ్వాదానికి దిగారు. హోటల్‌లో భోజనం నాణ్యతగా ఉంటుందని.. ఎవరు ఫిర్యాదు చేశారో చెప్పాలని పట్టుబట్టారు. దీంతో తామే భోజనం చేస్తుండగా నాణ్యత లేదని తెలిసిందని, మొదటి సారి కాబట్టి కేవలం నోటీసులు ఇస్తున్నామని, చర్యలు ఉండవడం తెలిపారు. దీంతో గొడవ సద్దుమణిగింది. అనంతరం ఫుడ్‌సేఫ్టీ అధికారిణి స్వాతి మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయానికి వచ్చి వివరణ ఇవ్వాలని హోటల్ యజమానికి చెప్పినా పట్టించుకోకపోవడంతో.. అదనపు కలెక్టర్‌కు సమస్యను వివరించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా ఫుడ్‌సేఫ్టీ అధికారులు చెప్పినట్లుగా భోజనంలో వెంట్రుక రాలేదని, వారి ఆరోపణలో నిజం లేదని హోటల్ యజమాని చెప్పారు.

ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడి మృతి


విక్రమ్ (ఫైల్)

చింతపల్లి : రోడ్డుపై నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను ద్విచక్ర వాహనంతో ఢీ కొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన చింతపల్లి సమీపంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. శుక్రవారం ఎస్‌ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఘడియ గౌరారం గ్రామానికి చెందిన చెట్టిమళ్ల వెంకయ్య కుమారుడు విక్రంకుమార్(20) గురువారం రాత్రి గ్రామం నుంచి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయానికి కుటుంబ సర్వే దరఖాస్తు ఫారాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు తన ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. మార్గమధ్యలో డీజిల్ లేక ఓ రైతు ట్రాక్టర్‌ను రోడ్డుపై నిలిపి ఉంచాడు. రాత్రి సమయం కావడంతో విక్రం తన ద్విచక్రవాహనంతో ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విక్రంకుమార్‌ను చికిత్స నిమిత్తం మండలంలోని మాల్ తరలించగా అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాదయ్య తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి ..


కృష్ణ (ఫైల్)

మోటకొండూరు, ఆత్మకూరు (ఎం) : కూరెళ్ల గ్రామానికి చెందిన కస్తూరి ముత్యాలకృష్ణ (55) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపి న వివరాల ప్రకారం.. కస్తూరి ముత్యాలకృష్ణ గురువారం సాయంత్రం తన భార్యను భువనగిరిలో దింపడానికి ఆత్మకూరు (ఎం) మండలం కూరెళ్ల గ్రామం నుంచి బైక్‌పై తీసుకెళ్లాడు. తిరిగి రాత్రి గ్రామానికి వస్తుండగా మోటకొండూరు మండలం ముత్తిరెడ్డిగూడెం వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ముత్యాలకృష్ణను హైదరాబాద్‌కు తరలించగా శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రూ.7లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

నల్లగొండ క్రైం : సైబర్ నేరగాళ్ల వలలో పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.7లక్షల 31 వేలు పోగొట్టుకుంది. నల్లగొండ పట్టణానికి చెందిన బండారు రమాదేవికి ఇటీవల ముంబాయి పోలీస్ అధికారులమంటూ ఒక ఫోన్‌కాల్ వచ్చింది. 'మీకు వచ్చే పార్సిళ్లను పరిశీలించగా మీ ఆధార్ కార్డుపై మనీ ల్యాండరింగ్ కేసులు ఉన్నాయని, వీటిని క్లియర్ చేయాలంటే.. మేము పంపించే లింక్ ఓపెన్ చేయాలి' అని సూచించారు. వీడియో కాల్ చేస్తూ ఎవరికీ చెప్పవద్దని, ఏవరికైనా చెబితే అందరినీ అరెస్టు చేయాల్సి ఉంటుందని నమ్మించారు. డబ్బులు పంపితే కేసు క్లియర్ అవుతుందని చెప్పడంతో సైబర్ నేరగాళ్లు పంపిన ఖాతా నంబర్‌కు రమాదేవి దశల వారీగా రూ.7లక్షల 31 వేలు ఫోన్ పే ద్వారా చెల్లించింది. ఆ తర్వాత ఆ నంబర్‌కు రమాదేవి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. అంతేకాకుండా సైబర్ నేరగాళ్లు పంపిన లింక్ కూడా కనిపించలేదు. దీంతో మోసపోయినట్లు గ్రహించి ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ టుటౌన్ ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు వ్యక్తులు ఫోన్‌చేసి వారు పంపించే లింక్‌లు ఓపెన్ చేయాలని చెబితే నమ్మవద్దని కోరారు.

కారు ఢీకొని వృద్ధుడి దుర్మరణం

అనంతగిరి: మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన ఫణితి ఎలీషా(64) అనే వృద్ధుడు శుక్రవారం ఖమ్మం–కోదాడ జాతీయ రహదారిపై శాంతినగర్ వద్ద రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని మృతిచెందాడు. స్థానిక ఎస్‌ఐ ఎం.నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎలీషా రోడ్డు దాటే ప్రయత్నం చేస్తుండగా కోదాడ నుంచి ఖమ్మం వైపు వెళ్లే కారు అతివేగంగా ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఎలీషా అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అంతర్జాతీయ సైన్స్ ఫెస్టివల్‌కు రమేష్‌బాబు


రమేష్‌బాబు

సూర్యాపేట,మునగాల: మునగాల నర్సింహులగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న జి.రమేష్‌బాబు అంతర్జాతీయ సైన్స్ ఫెస్టివల్‌లో అతిథిగా పాల్గొనాల్సిందిగా శుక్రవారం ఆహ్వానం అందింది. భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి నాలుగు రోజుల పాటు గౌహతి ఐఐటీలో నిర్వహించే అంతర్జాతీయ సైన్స్ ఫెస్టివల్‌లో తాను పాల్గొననున్నట్లు రమేష్‌బాబు తెలిపారు. విజ్ఞానభారతి సౌజన్యంతో పలు శాస్త్ర సాంకేతిక అంశాల ప్రదర్శనలు వీక్షించడంతోపాటు విజ్ఞానశాస్త్ర బోధనలో వినూత్న మెళకువలు పంచుకునేందుకు సూర్యాపేట జిల్లా విద్యాశాఖ నుంచి ప్రతినిధిగా తాను పాల్గొననున్నట్లు తెలిపారు. పలు జాతీయ, అంతర్జాతీయ సైన్స్ ఫెయిర్‌లలో ఉత్తమ ప్రదర్శనలతోపాటు పలు అవార్డులు గెలుచుకోవడం, ఉమ్మడి జిల్లా సైన్స్ అధికారిగా సమర్థవంతంగా విధులు నిర్వహించడంతో తనకు అవకాశం దక్కిందన్నారు. రమేష్‌బాబుకు అరుదైన గౌరవం దక్కడంపై జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, సెక్టోరియల్ అధికారులు శ్రవణ్‌కుమార్, జనార్దన్, రాంబాబు, జిల్లా గెజిటెడ్ ఉపాధ్యాయుల సంఘ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు జిల్లా ప్రసాద్, వనమాల వెంకటేశ్వర్లు పలువురు మండల విద్యాధికారులు అభినందించారు.

పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్


ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలంలోని రామాజీపేట గ్రామ పరిధిలో గల యాదాద్రి లైఫ్ సైన్సెస్ పరిశ్రమలో డ్రగ్స్ తయారీ చేస్తూ ఇటీవల పట్టుబడిన ముఠాలో, పరారీలో ఉన్న నిందితుడు మచ్చ భానుప్రసాద్ శుక్రవారం సాయంత్రం పోలీసులకు పట్టుబడ్డాడు. యాదగిరిగుట్ట సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు గ్రామానికి చెందిన మచ్చ భానుప్రసాద్ తన ద్విచక్ర వాహనంపై పెద్దకందుకూరు గ్రామం నుంచి యాదగిరిగుట్ట వైపు మత్తు పదార్థాలతో వెళుతున్నాడనే విశ్వసనీయ సమాచారం పోలీసులకు అందింది. దీంతో పోలీసులు మార్గమధ్యలో అతడి వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, ఒక కేజీ మెఫెడ్రిన్, 400 గ్రాముల ఆల్ప్రజోలమ్ అనే నిషేధిత మత్తుపదార్థాలు దొరికాయి. వాటిని స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కాగా గత సోమ, మంగళవారాల్లో పోలీసులు చేసిన తనిఖీల్లో యాదాద్రి లైఫ్ సైన్సెస్ పరిశ్రమలో తయారైన 120 కేజీల నిషేధిత ఎఫెడ్రిన్, మెఫెడ్రిన్ అనే మత్తుపదార్థాలు పట్టుబడ్డాయి. ఈ కేసులో భానుప్రసాద్ నిందితుడు.

సర్వీస్ రోడ్డులో నిర్మాణాలు కూల్చివేత


చిట్యాల బస్‌స్టేషన్ సమీపంలో సర్వీస్ రోడ్డుపై నిర్మాణాలను కూల్చివేస్తున్న జేసీబీ

చిట్యాల: ప్రమాదాల నివారణకు చిట్యాల పట్టణంలో 65వ నంబరు జాతీయ రహదారిపై నిర్మించనున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులకు సర్వీస్ రోడ్డులో అడ్డుగా ఉన్న నిర్మాణాలను శుక్రవారం జేసీబీలతో అధికారులు కూల్చివేయించారు. సర్వీస్ రోడ్డు వెంట నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన మెట్లు, ఇతర నిర్మాణాలను తొలగించుకోవాలని గతంలో అధికారులు మార్కింగ్ చేసి యజమానులకు సూచించారు. అయినప్పటికీ ఆ నిర్మాణాలను తొలగించుకోకపోవడంతో శుక్రవారం హైవే అధికారులు చెట్లతోపాటు పలు భవనాల మెట్లు, ఇతర నిర్మాణాలను జేసీబీలతో కూల్చివేయించారు. చిట్యాల పట్టణంలోని జాతీయ రహదారి మధ్యలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు మరో పది రోజుల్లో ప్రారంభం కానున్ననందున విజయవాడ–హైదరాబాద్–భువనగిరికి వెళ్లే వాహనాలను సర్వీస్ రోడ్డు ద్వారా మళ్లించేందుకు అడ్డుగా ఉన్న నిర్మాణాలను తొలగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టే ప్రాంతాన్ని నల్ల గొండ డీఎస్పీ శివరాంరెడ్డి, చిట్యాల ఎస్‌ఐ ధర్మాతో కలిసి పరిశీలించారు.

వివాహిత మృతిపై కేసు నమోదు

హుజూర్‌నగర్ : పిల్లలు పుట్టకపోవడంతో మనస్తాపానికి గురైన ఓ వివాహిత ఉరి వేసుకుని మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ముత్తయ్య శుక్రవారం తెలిపారు. వివరాలు.. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన బి నరేష్‌కు పాలకవీడు మండలం రావిపహాడ్‌కు చెందిన లక్ష్మీతో ఆరేళ్ల క్రితం పెళ్లి జరిగింది. వీరికి పిల్లలు లేరు. దీంతో మనస్థాపానికి గురైన లక్ష్మీ గురువారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందింది. మృతురాలి తండ్రి కోటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు.

రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యం కొనాలి

వేములపల్లి(మాడ్గులపల్లి): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బంది పెట్టకుండా ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు చేయాలని డీఆర్‌డీఓ వై.శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాడ్గుల పల్లి మండలం పాములపాడు, ఆగామోత్కూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. రికార్డులను పరిశీలించి మాట్లాడారు. తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కాంటాలు వేసి తరలించాలన్నారు. రైతులు సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్మి మద్దతు ధరతోపాటు బోనస్ రూ.500 పొందాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఏపీఎం బాషపాక చంద్రశేఖర్, వీఓఏ పావని, రేణుక, వీఓ అధ్యక్షురాలు మణెమ్మ, సంధ్య తదితరులు ఉన్నారు.

నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తాం


భూములు పరిశీలిస్తున్న ఆర్డీఓ రమణారెడ్డి

చింతపల్లి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా దేవరకొండ మండలం ఎల్లారెడ్డి బావి, నాంపల్లి మండలంలోని లక్ష్మణపురం, చింతపల్లి మండలం ఈదుల గండి, గ్రామాల్లో భూములు ఇళ్లు కోల్పోయే రైతులకు చింతపల్లి మండల కేంద్రంలో పునరావాసం కల్పించనున్నట్లు దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి తెలిపారు. శుక్రవారం పునరావాస కేంద్రంలోని భూములను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా భూములతోపాటు ఇళ్లు కోల్పోయిన వారికి మండల కేంద్రంలోని 154 సర్వే నంబర్‌లో పునరావాసం కల్పించేందుకు చర్యలను ముమ్మరం చేస్తోందన్నారు. ఇప్పటికే మొదటి విడతలో లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయడంతోపాటు, తాగునీరు రోడ్ల సదుపాయాలు, విద్య, అంగన్‌వాడీ కేంద్రం వంటి సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా 154 సర్వే నంబర్‌లో పాత పహాణీల ప్రకారం లబ్ధిదారులను రెవెన్యూ అధికారులు ఎంపిక చేయడంతో రెవెన్యూ అధికారులను రైతులు సర్వే చేయకుండా అడ్డుకున్నారు. ప్రస్తుతం భూములు కొనుగోలు చేసిన రైతులు భూమిపై కబ్జాలో ఉండడంతో రెవెన్యూ అధికారులు పాతవారికి చెక్కులు మంజూరు చేశారు. దీంతో భూమిని చదును చేస్తున్న వాహనాలను రైతుల అడ్డుకుని రెవెన్యూ అధికారులను తమకు పరిహారం అందించేంత వరకు భూముల వద్దకు రావద్దని ఆర్డీఓకు విన్నవించుకున్నారు. స్పందించిన ఆర్డీఓ లబ్ధిదారులకు అందరికీ న్యాయం చేశామని హామీ ఇచ్చారు. ఆయన వెంట తహసీల్దారు రమాకాంత్ శర్మ, ఆర్ఐ సునీత, సర్వేయర్ రతన్ లాల్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

హైవే వెంట డీజిల్ దొంగలు

ఆగి ఉన్న లారీలే టార్గెట్

- నిద్రావస్థలో పోలీస్ హైవే పెట్రోలింగ్
- దుండగులను పట్టుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ బాధితుల ఆరోపణ


హైవే వెంట ఆగి ఉన్న లారీ నుంచి డీజిల్ దొంగిలిస్తున్న దుండగులు

చౌటుప్పల్ రూరల్: హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారి పక్కన నిలిపిన లారీలే వారి టార్గెట్.. డ్రైవర్ల నిద్ర మత్తును ఆసరా చేసుకుని డీజిల్ దొంగలు రెచ్చిపోతున్నారు. జాతీయ రహదారి–65పై నెలరోజులుగా రోడ్డు పక్కన నిలిపిన లారీల నుంచి వందల లీటర్ల డీజిల్ దొంగతనం చేసి ఎత్తుకెళ్తున్నారు. గత నెలలో చౌటుప్పల్ మండలం పంతంగి పరిధిలోని ఓ పెట్రోల్ బంక్‌లో తెల్లవారుజామున దర్జాగా కారులో వచ్చి బంక్‌లో నిలిపి ఉంచిన లారీ నుంచి డీజిల్ ఎత్తుకెళ్లిపోయారు. దండు మల్కాపురం గ్రామ పరిధిలోని బోరోళ్లగూడెం సమీపంలో జాతీయ రహదారి పక్కన ఆపిన లారీ డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకోగానే కారులో వచ్చిన దొంగలు లారీ డీజిల్ ట్యాంక్ తాళం విరగ్గొట్టి డీజిల్‌ను క్యాన్లలో నింపుకుని వెళ్లారు. తాజాగా పంతంగి గ్రామ స్టేజీ వద్ద ఉన్న ఓ పంక్చర్ దుకాణం దగ్గర పార్కింగ్ చేసిన లారీ నుంచి డీజిల్ ఎత్తుకెళ్లారు. దుండగులు డీజిల్ ఎత్తుకెళ్లిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. అదేవిధంగా టోల్ ప్లాజాలకు కూతవేటు దూరంలో ఉన్న ఆరెగూడెం గ్రామ స్టేజీకి ఎదురుగా ఉన్న పంక్చర్ దుకాణం వద్ద పార్కింగ్ చేసిన మూడు లారీల నుంచి సుమారు 650 లీటర్ల డీజిల్‌ను దొంగలు ఎత్తుకెళ్లిపోయారు. రాత్రి సమయంలో కారులో రెక్కి చేసి ఎక్కడ లారీలు పార్కింగ్ చేసి ఉన్నాయో నిర్ధారించుకున్న తర్వాత తెల్లవారుజామున కారులో లారీల వద్దకు వెళ్లి వారు తెచ్చుకున్న క్యాన్లలో డీజిల్‌ను దొంగిలించుకుపోతున్నట్లు సీసీ కెమెరాల్లో రికార్డయింది.

హైవేపై రెండు పెట్రోలింగ్ వాహనాలు

జాతీయ రహదారి–65పై వాహనాల రద్దీ విపరీతంగా ఉంటుంది. చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో తుప్రాన్‌పేట నుంచి రెడ్డిబాయి వరకు రెండు హైవే పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు 24 గంటలు గస్తీ కాస్తాయి. నిత్యం ఈ రహదారిపై జరిగే రోడ్డు ప్రమాదాలు, చోరీలు, అసాంఘిక కార్యకలాపాలు నివారించేందుకు చౌటుప్పల్ పోలీస్ సిబ్బంది ఈ వాహనాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తారు. అయితే రాత్రి సమయాల్లో జాతీయ రహదారిపై పెట్రోలింగ్ నిర్వహించకుండా టోల్‌ప్లాజా వద్ద, దండు మల్కాపురం పెట్రోల్ బంక్‌లో పెట్రోలింగ్ వాహనం నిలుపుకుని నిద్రపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఫలితంగా హైవే వెంట, పంక్చర్ దుకాణాల వద్ద నిలిపి ఉంచిన వాహనాల నుంచి డీజిల్ దొంగతనాలు జరుగుతున్నాయనే బాధితులు వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి డీజిల్ దొంగల ఆగడాలను అరికట్టాలని బాధితులు కోరుతున్నారు.

హైవేపై పెట్రోలింగ్ పెంచుతాం

జాతీయ రహదారిపై ప్రతిరోజు రెండు పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు పెట్రోలింగ్ నిర్వహిస్తూనే ఉన్నాయి. లారీ డ్రైవర్లు కూడా హైవేపై ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయకుండా నిర్దేశించిన స్థలాల్లో పార్కింగ్ చేసుకోవాలి. పార్కింగ్ చేసిన స్థలానికి ఏదైనా కారు, వ్యక్తులు అనుమానాస్పదంగా వచ్చినట్లు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలి.100 నంబర్‌కు డయల్ చేస్తే పెట్రోలింగ్ సిబ్బంది వెంటనే ఘటన స్థలానికి వస్తారు. హైవేపై పెట్రోలింగ్ పెంచుతాం.

–మన్మథకుమార్, చౌటుప్పల్ సీఐ

వైభవంగా మాసకల్యాణం

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభు లింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మాస కల్యాణాన్ని వైభవంగానిర్వహించారు. సందర్భంగా అర్చకులు స్వామి వార్లను పూలు, పట్టు వస్త్రాలతో అందంగా అలంకరించారు. పుణ్యావచనం, పంచామృతాభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణ ఘట్టం పూర్తి గావించారు. ఈఓ కొండారెడ్డి, విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయశర్మ, శంభిరెడ్డి, పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్ పద్ధతితో అధిక దిగుబడులు


గరిడేపల్లిలో డ్రమ్ సీడర్‌తో విత్తనాలు విత్తడాన్ని పరిశీలిస్తున్న అగ్రికల్చర్ విద్యార్థులు

గరిడేపల్లి : డ్రమ్ సీడర్ పద్ధతిలో విత్తనాలు విత్తడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని హైదరాబాద్‌లోని మల్లారెడ్డి యూనివర్సిటీ అగ్రికల్చర్ విద్యార్థులు అన్నారు. శుక్రవారం గరిడేపల్లి మండల కేంద్రంలో రైతులు డ్రమ్ సీడర్ ద్వారా విత్తనాలు విత్తడాన్ని పరిశీలించి మాట్లాడారు. డ్రమ్ సీడర్ ద్వారా ఎకరానికి కేవలం 8 నుంచి 10 కేజీల విత్తనాలు సరిపోతాయన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ ప్రాంతంలో విత్తనాలు విత్తవచ్చన్నారు.